ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 3, ఏప్రిల్ 2026

ఘనంగా హనుమాన్ జయంతి

ఉట్నూర్, ఏప్రిల్ 2,ప్రభాతవార్త

హనుమాన్ జయంతి వేడుకలను ఉట్నూర్‌లో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం జండాను ఊపి శోభా యాత్ర ను ప్రారంభించిన ఐటీడీఏ పి ఓ యువరాజ్ మర్మాట్.పి ఓ మాట్లాడుతూ హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు చేసి ఐ బి వరకు శోభాయాత్రలో పాల్గొన్నారు. హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు శ్రీరామ్,భక్తులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు

✻ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల, జిల్లా స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఉపాధి అవకాశాల సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, కార్యాలయాల నోటీసు బోర్డులలో ప్రదర్శించాలని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌లు అర్హులైన

మిగతా 2లో..

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ, వార్డు సభలు

✻ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో, అలాగే నిర్మల్ పట్టణంలోని బుధవార్ పేట్, మోచి గల్లి వార్డు సభల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి స్థానిక సమస్యలపై చర్చించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు వంటి పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే 60 వేల నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అధికారులంతా జవాబుదారీతనంతో పని చేస్తూ ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని అధికారులు మిగతా 2లో..

సంక్షేమ పథకాలను అందరికి అందేలా చూడాలి

✻ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

దహెగాం, ఏప్రిల్ 2,ప్రభాతవార్త :

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందరికి అందేలా చూడాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా దహెగాం మండలంలోని చిన్న రాస్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమానికి హాజరు అయ్యారు.ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అందరికి అందేలా చూడాలని గ్రామలలో ఉన్న ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో బిక్షపతి, ఎంపీవో శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ రామారావు,గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్,గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, వార్డు సభ్యులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు

✪ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఉట్నూర్, ఏప్రిల్ 2,ప్రభాత వార్త :

గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు.జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదిక లో నిర్వహించిన గ్రామసభ కు ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజారయ్యారు.ముందుగా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపిడిఓ రామ్ ప్రసాద్, గ్రామ పంచాయతీ నివేదికను పంచాయతీ కార్యదర్శి శంకర్ గ్రామ సభలో చదివి వినిపించారు, మిగతా 2లో..

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ, వార్డు సభలు

(మొదటిపేజీ తరువాయి)

చదివి వినిపించారు. అనంతరం, జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు లభించేలా కృషి చేసిన కలెక్టర్‌ను మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో డీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సర్పంచ్ వనిత, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు సమాచారం అందించాలని తెలిపారు. పలు దేశాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అర్హత గల మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జర్మనీ దేశంలో నర్సింగ్, ఎలక్ట్రికల్/పవర్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతర్ దోహా దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు, గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ, హౌస్ కీపింగ్, వెయిటర్లు, బార్బెండర్లు, వంట మనుషులు, హోటల్ రిసెప్షనిస్ట్, స్పా థెరపిస్టులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, లైఫ్ గార్డులు, గార్డెనర్లు, బెల్ బాయ్స్, ఫిషర్ మెన్ ఇతర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాల సంబంధిత విద్యార్హతలతో పాటు అభ్యర్థుల వయసు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇంగ్లీష్ భాష పరిజ్ఞానం కలిగి ఉండాలని, 2, 3 సంవత్సరాల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, వసతి, ఆహారం, మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత గల మైనారిటీ అభ్యర్థులు తమ బయోడేటా/సివిను వెంటనే tomcomglobal gmail.com, tomcom.resume gmail.com లకు మెయిల్ చేయవచ్చని, ఇతర వివరాలకు 9440048590, 9440049937, 9440051452, 8919047600 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

మహనీయుల ఆశయాలు, స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ముందుకు సాగుదామని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమానికి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, గౌడ కుల సంఘ నాయకులతో కలిసి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనేక కులాలను ఏకం చేసి వీరోచితంగా పోరాడారని తెలిపారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి సమాజానికి మార్గదర్శకంగా నిలిచిన మహనీయుడని అన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించి వారి ఆశయ సాధనకు కలిసికట్టుగా ముందుకు సాగాలని తెలిపారు. సంఘ నాయకులు తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్, గౌడ కుల సంఘ నాయకులు కొండ జగ్గా గౌడ్, మార్క శంకర్ గౌడ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవి గౌడ్, నీరజ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులు అర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు

జిల్లా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు

(మొదటిపేజీ తరువాయి)

పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉట్నూరు గ్రామ పంచాయతీలో మొదటి విడతగా సుమారు 66 ఇళ్లకు గాను 90 లక్షల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16,000 ఇళ్లకు గాను సుమారు 220 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదేళ్లలో ఇళ్లు అందుతాయన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కొత్తగా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని, అలాగే ఉట్నూరు ఐటిఐలో టాటా సంస్థ సహకారంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. దీని ద్వారా 200 మంది యువతకు రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఉన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా ఇంద్రమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా గెజిటెడ్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా నాలుగు విడతల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి కోసం కొత్త బోరుబావుల మంజూరు వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు ఫోన్లకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ, అధికారుల సమన్వయంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉట్నూర్ రైతువేదిక సమీపంలోని వెదురు తయారీదారుల ఇళ్లను సందర్శించి, వారి జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువ సమస్య తెలియజేయగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో రామ్ ప్రసాద్, స్థానిక సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఈ ఓ శంకర్, రైతులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి ఎన్జీవో ఆధ్వర్యంలో అన్నదానం

బెల్లంపల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలో ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం మరోసారి విజయవంతంగా జరిగింది. కాంట చౌరస్తా, పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్ మరియు టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 376వ వారానికి చేరుకున్న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2020 సంవత్సరంలో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ప్రతి ఆదివారం నిరంతరంగా కొనసాగుతూ, బెల్లంపల్లి పట్టణంలోని నిరుపేదలు, యాచకులు, దినసరి కూలీలు, బాటసారులకు భోజనం అందిస్తోంది. ఈ సారి సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించారు. జిల్‌కర్ అనిల్ కుమార్ 5వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతల అభిలాష మేరకు రూ.10,000 వ్యయంతో 200 స్టీల్ ప్లేట్లను వాంకిడి తహసీల్దార్ దామెర కవిత అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు దామెర వంశీ, పి. జ్యోతిశ్రీనివాస్, ఎమ్‌డీ ఫసీయుద్దీన్, పానుగంటి మధు, గడ్డం రవిచంద్ పాల్గొన్నారు. అలాగే అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, తోటపెల్లి సమ్మన్న, చెందుపట్ల లింగమూర్తి, ఎమ్‌డీ యూసుఫ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

జన్నారం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల అన్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని పైడిపెల్లి హనుమాన్ దేవాలయంలో జక్కు భాగ్యలక్ష్మి సత్తయ్య దంపతులు, కుటుంబ సభ్యులు జక్కు రజిత రమేష్, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, జక్కు అనురాధ శ్రీనివాస్‌లు వేద పండితులు గుండి సత్తయ్య శర్మ, గుండి గణేష్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుండే స్వామి వారికి అభిషేఖాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హోమం నిర్వహించారు. పైడిపెల్లి హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు సత్తయ్య శర్మ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆ దేవుడి దయ వల్ల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించిన జక్కు భాగ్యలక్ష్మి సత్తయ్య దంపతులను, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దుర్గం లక్ష్మీ నారాయణ, మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్ సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, గుర్రం మోహన్ రెడ్డి, హన్మంతరావు, ఇందయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పాలకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

హాజీపూర్, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

మంచిర్యాల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 17వ డివిజన్ నూతన కార్యాలయాన్ని గురువారం రోజు మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ రమ్య ప్రారంభించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ రమ్య, స్థానిక కార్పొరేటర్ లాగిశెట్టి రాజయ్యతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మేయర్ రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వార్డు సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు, డ్రైనేజ్ సమస్యలు, ఇండ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్ల తొలగింపు వంటి అంశాలను ప్రజలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ స్పందిస్తూ, ప్రజల సమస్యలను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 17వ డివిజన్ కార్యాలయం వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్రబిందువుగా నిలవాల, పాలకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎలాంటి సమస్యలైనా నేరుగా కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. పారదర్శక పాలనకు, సత్వర సేవలందించడానికి ఈ కార్యాలయం వేదికగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ లాగిశెట్టి రాజయ్య మాట్లాడుతూ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మేయర్, డిప్యూటీ మేయర్‌ల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు తక్షణ సేవలు అందించడంతో పాటు అభివృద్ధి పనులను సమర్థవంతంగా పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ వార్డు అధికారి కుమారస్వామి, 18వ డివిజన్ కార్పొరేటర్ రాసామల్ల కమల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబరావు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

17వ వార్డు లోని వార్డు సభ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

హాజీపూర్, ఏప్రిల్ 02,ప్రభాతవార్త

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు రాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల.సురేఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ ఈ ప్రజాపాలన ప్రభుత్వం, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గెలిచి రెండున్నర సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు .ఇవే కాకుండా మన ఎమ్మెల్యే పేద ప్రజలకు ఎల్.ఓ.సి .చెక్కులు, సిఎంఆర్ఎఫ్ చెక్కులు, దాదాపు 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగిందన్నారు.ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం. గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ కిషన్,సర్పంచ్ రాంరెడ్డి, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కమలాపూర్ గుట్ట హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు

భైంసా, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని కమలాపూర్ గుట్టపై వెలసిన శ్రీ హనుమాన్ ఆలయంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ గురువారం స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హనుమంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ముఖ్యంగా యువత ధార్మిక విలువలను పాటిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. భక్తి భావంతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, మాజీ చైర్మన్ గంగాధర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాహుల రాము, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మహానుభావుల జయంతి ఉత్సవాలు ప్రభుత్వమే నిర్వహించాలి

- దళిత సంఘాల ఐక్యవేదిక

బెల్లంపల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలో మహానుభావుల జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక అధ్యక్షుడు చిలుక రాజనర్సు, ప్రధాన కార్యదర్శి గోమాస రాజం ఆధ్వర్యంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ ను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిలుక రాజనర్సు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలను మహానుభావుల మాసంగా గుర్తించి రాష్ట్ర రాజధానిలో మంత్రుల ఆధ్వర్యంలో ప్రభుత్వమే ఉత్సవాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. అదే విధంగా బెల్లంపల్లిలో కూడా బాబు జగ్జీవన్ రామ్ జయంతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించిన ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించాలని సూచించారు. ఈ విజ్ఞప్తిపై కమిషనర్ సంపత్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదనంగా, రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ చౌరస్తాలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం చుట్టూ ఉన్న కాంపౌండ్ గోడ ధ్వంసమైందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్, విగ్రహ ప్రాంగణాన్ని పరిశీలించి శుభ్రపరిచే చర్యలు చేపట్టి, ఏప్రిల్ 5న జరిగే జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అసాది మదు, ఉపాధ్యక్షులు కలాలి నర్సయ్య, బత్తుల రాజలింగు, కార్యదర్శులు కారెంగుల మల్లేష్, ఏనగందుల శివాజీ, బేడ్డల మహేందర్, గోగర్ల శేఖర్, గడ్డల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జన్మదినోత్సవాలు

సారంగాపూర్, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని హనుమాన్ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జామ్ గ్రామంలో హనుమాన్ జన్మదినోత్సవం పురస్కరించుకుని భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామాలలోని యువకులు, హనుమాన్ మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో మండల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేశారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి కుప్టి గ్రామస్తుల పాలాభిషేకం

నేరడిగొండ, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామస్తులు గురువారం ఘనంగా పాలాభిషేకం చేశారు. గ్రామానికి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించినందుకు కృతజ్ఞతగా గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను గుర్తించి, సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో వ్యవసాయానికి, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డు సభలో ప్రజా సమస్యల వినతులు: మున్సిపల్ కమిషనర్ వై.నవీన్

భైంసా, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని 9వ వార్డులో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ వార్డు సభకు మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, కౌన్సిలర్ తాలోడ్ శ్రీనివాస్ హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు పలు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు సమర్పించారు. వార్డులోని హనుమాన్ మందిరం రోడ్డు, గోకుల్ నగర్ ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతూ లిఖితపూర్వకంగా విన్నవించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ సౌకర్యం లేదని, తక్షణమే త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

వినతి పత్రాలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వై.నవీన్, కౌన్సిలర్ తాలోడ్ శ్రీనివాస్

ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

● జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

తాండూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. తాండూర్ మండలంలోని కిష్టంపేట, తాండూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన గ్రామసభలకు అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. గ్రామసభలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్ లోని డివిజన్లు, మున్సిపాలిటీలలోని వార్డులలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నదన్నారు. ఈ పథకాల ప్రగతి వివరాలను ప్రజలకు వివరించి పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామసభలు, వార్డు సభల ద్వారా స్థానిక ప్రజలు ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నదన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా పలు పథకాల లబ్దిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. విద్యుత్, పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామ సభలలో స్థానిక సర్పంచులు ముడిమడుగుల సురేష్, సార్ల తిరుపతి, ఉప సర్పంచులు సత్యనారాయణ, అనుమండ్ల విక్రమ్, తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వార్డు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొని ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

గ్రామసభలతోనే సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం గ్రామసభలు ఉత్సవంగా జరిగాయి. మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ కోనేరు భూమన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పలువురు మహిళలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించగా, సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో కృష్ణకాంత్, ఏపీవో అజీజ్ ఖాన్, ఉపసర్పంచ్ కృష్ణ రెడ్డి, ఏపీఎం మాధురి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

వైభవంగా హనుమాన్ జన్మోత్సవ శోభాయాత్ర: పాల్గొన్న విఠల్ రెడ్డి

భైంసా, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో శ్రీ వీర హనుమాన్ జన్మోత్సవ శోభాయాత్ర గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముధోల్ మాజీ శాసనసభ్యులు విఠల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ స్వామి భక్తి, శక్తి, ధైర్యానికి నిలువెత్తు ప్రతీక అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సామాజిక ఐక్యత పెంపొందుతుందని, ప్రజల్లో సత్సంకల్పాలు పెరుగుతాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు, గ్రామ కమిటీ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షురాలు సుగుణ

జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి

- పాల్గొననున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ఆసిఫాబాద్ టౌన్ , ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షురాలు సుగుణ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక డిసిసి కార్యాలయంలో పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గం ఇంచార్జి శ్యామ్ నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే జిల్లా కార్యవర్గ సమావేశానికి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించానున్నారు. అదేవిధంగా పార్టీ నిర్మాణం, బలోపేతం, కార్యవర్గ సభ్యులకు దిశానిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు హాజరు అవుతారని తెలిపారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మంగ, నాయకులు గాదివేణి మల్లేష్, సుధాకర్, జక్కన్న, తారిక్, భాస్కర్, సంతోష్, మారుతీ, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పలు గ్రామాల్లో గ్రామసభలు

జన్నారం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 27 నెలల్లో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రవేశపెట్టనున్న కొత్త పథకాలు వివరాలను తెలియజేశారు. గ్రామస్తులు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులకు తెలియజేయగా వారు రిజిష్టర్‌లో నమోదు చేసుకుని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మండల కేంద్రంలోని పొనకల్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, కార్యదర్శి రాహుల్ గుప్తా ల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తోందని అన్నారు. ఈ గ్రామ సభల ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పాల జలపతి, ఫైర్ అధికారి శ్రీనివాస్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పథకాల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన

సారంగాపూర్, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని కౌట్ల (బి), ఇప్పచెల్మె, లింగాపూర్, కుప్టి, రామ్ సింగ్ తండా, సారంగాపూర్ గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు, వర్కింగ్ షెడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల ప్రహరీ గోడలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులను ప్రారంభించారు. ముఖ్యంగా పొట్యా గ్రామంలో రూ. 1.87 కోట్ల వ్యయంతో నిర్మించనున్న చెక్ డ్యామ్ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, మండల బీజేపీ అధ్యక్షుడు కాల్వ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 02, ప్రభాత వార్త

లక్షెట్టిపేట పట్టణంలోని బిట్ బజార్ కు చెందిన కొండ సరోజన అనే మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది అని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. బాధితురాలు గురువారం ఉదయం 7 గంటలకు గుడికి వెళ్లేందుకు ఇంటి ముందు చెట్టుకి ఉన్న పూలు తెంపుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్ పై వెనకాల నుండి వచ్చి బాధితురాలు మెడలో నుంచి పుస్తెల తాడును దొంగిలించికెళ్లాడు. చోరీకి గురైన పుస్తెలతాడు మూడు తులాల వరకు ఉంటుందని దీని విలువ 90000 ఉంటుందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలించడం జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోరుతూ ప్రజాప్రతినిధుల వినతి

బెల్లంపల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పురపాలక పరిపాలన శాఖ ప్రభుత్వ కార్యదర్శి, కమిషనర్ అండ్ డైరెక్టర్ (ఎఫ్ఏసి) డాక్టర్ టి.కె. శ్రీదేవి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు పాల్గొని పట్టణంలో కొనసాగుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరించి, వీటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రధానంగా డంపింగ్ యార్డు అభివృద్ధికి అవసరమైన కాంపౌండ్ వాల్, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డిఆర్సిసి) షెడ్, అంతర్గత రహదారులు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వైకుంఠ ధామం అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. పట్టణంలో శుభ్రత నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు ఇంటింటికి చెత్త సేకరణ కోసం 11 కొత్త స్వచ్ఛ ఆటోలు కొనుగోలు చేయాలని వినతిలో పేర్కొన్నారు. అదనంగా, మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మురుగు కాలువల ఏర్పాటుకు నిధులు అవసరమని తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేందుకు ఇద్దరు శానిటేషన్ ఇన్స్పెక్టర్లను నియమించడంతో పాటు తగిన సిబ్బందిని నియమించాలని కోరారు. పలు ప్రాంతాల్లో పెద్ద డ్రైన్ల నిర్మాణం, వాటి విస్తరణ పనులు చేపట్టడం అత్యవసరమని వివరించారు. ఈ అన్ని పనులు త్వరితగతిన పూర్తి కావాలంటే తగిన నిధులు విడుదల చేయాలని వారు అధికారులను కోరారు. వినతిపై స్పందించిన డాక్టర్ టి.కె. శ్రీదేవి ప్రతిపాదించిన అభివృద్ధి పనుల ప్రాముఖ్యతను గుర్తించి, అవసరమైన నిధులను సమీకరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు పట్టుదలగా ముందుకు వస్తుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

యువతి వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

పేదింటి యువతీ వివాహానికి ఆర్థిక సాయం

తాండూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

తాండూర్ గ్రామానికి చెందిన కంపెల మమత అనే పేదింటి యువతీ వివాహానికి గురువారం మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ రూ.5 వేలు, తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ రూ.2 వేల ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ రూ.3వేలు, 14వ వార్డు సభ్యులు భాగ్యలక్ష్మి సారయ్య వేయి రూపాయలు ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెట్టెం విష్ణు కళ్యాణ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రూ 5 వేలు విలువ గల కూలర్ చేశారు. సందర్భంగా వధువు, ఆమె కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

తాండూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

మండలంలోని బోయపల్లి గ్రామపంచాయతీలో గురువారం సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సర్పంచ్, నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామసభలో ప్రజల నుండి ఎంఈఓ దుర్గం శ్రీనివాస్ వినతి పత్రాలు స్వీకరించారు. గ్రామసభలో ఉప సర్పంచ్ నల్లుల మహేష్, సింగిల్ విండో డైరెక్ట్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదారంలో ఘనంగా హనుమాన్ జయంతి

తాండూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

మండలంలోని మాదారం టౌన్ షిప్ శ్రీ కోదండ రామాలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు శర్మ వేదమంత్రాలతో ఆంజనేయ స్వామికి అభిషేకం, ఆకు పూజ, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

4న మామిడికాయల దిగుబడి కోసం వేలంపాట

తాండూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో గల ఉద్యాన నర్సరీలో మామిడి కాయల దిగుబడి కోసం ఈ నెల 4న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారిని జక్కుల అర్చన తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం పాట జరుగుతుందని, ఆసక్తి గల వారు సకాలంలో 1000 రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆమె కోరారు.

బెల్లంపల్లిలో 34 వార్డుల్లో వార్డు సభలు విజయవంతం

- ప్రభుత్వ పథకాలపై చర్చ, అభిప్రాయ సేకరణ

బెల్లంపల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యచరణ ప్రణాళిక మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 34 వార్డులలో గురువారం రోజున వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా, పథకాల అమలు తీరుపై లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించడం జరిగింది. ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే దిశగా ఈ సభలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వార్డు నంబర్లు 07, 16, 29లో జరిగిన సభల్లో మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్, సంబంధిత వార్డు కౌన్సిలర్లు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, సూపర్వైజర్లు, వార్డు సభ్యులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం 34 వార్డుల్లో నిర్వహించిన ఈ వార్డు సభలు సజావుగా జరిగి విజయవంతంగా ముగిశాయని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

పారాక్వాట్ మందును ఉత్పత్తి చేయడం, అమ్మకం నిషేధం

- మండల వ్యవసాయ అధికారి. ఆర్. శ్రీకాంత్

లక్షెట్టిపేట, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

పారాక్వాట్ అనే గడ్డి మందు అమ్మకం లేదా నిల్వ చేయడం నిషేధమని మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారాక్వాట్ అనే గడ్డి మందును రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 24 తేదీ 31 న వ్యవసాయ, సహకార శాఖ, తెలంగాణ ప్రభుత్వం ద్వారా 60 రోజుల నిషేధాన్ని విధించడం జరిగింది. కావున రాష్ట్రంలో పారాక్వాట్ అనే కలుపు మందు యొక్క అమ్మకం, నిల్వ, ఉత్పత్తి చేయడం నిషేధం.లక్షెట్టిపేట మండలంలో దాదాపు 1500 లీటర్ల పారాక్వాట్ అనే కలుపు మందుకి స్టాప్సేల్ నోటీసులు పై ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా 60 రోజుల ఇవ్వడం జరిగింది. కావున ఈ విషయాన్ని డీలర్లు, రైతు సోదరులు గమనించగలరు..పారాక్వాట్ అనే కలుపు మందు అత్యంత విషపూరితంగా ఉండటం, దానికి విరుగుడు లేకపోవడం, ఈ గడ్డి మందు బారిన పడి చాలామంది రైతులు మృత్యువాత పడడం, భూసారం దెబ్బ తినడం వంటి కారణాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఈ గడ్డి మందుకి 60 రోజుల నిషేధాన్ని విధించడం జరిగింది.

చలి వేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్

చలి వేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, ఏప్రిల్ 2,ప్రభాతవార్త :

హెడ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఉట్నూర్ లోని ప్రధాన కూడలిల వినాయక చౌక్,అంబేద్కర్ చౌక్,పాత ఉట్నూర్ వద్ద గురువారం ఉట్నూర్ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్ చేతుల మీదుగా చలి వేంద్రాలను ప్రారంభించరు. ఆమె మాట్లాడుతూ ఎండ కాలంలో సొసైటీ వాళ్ళు ఏర్పాటు చేస్తున్న చని వేంద్రం నీరు ను ప్రజలు వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకాంత్ జాదవ్,ఉపాధ్యక్షులు జాదవ్ శ్రీనివాస్,వార్డు సభ్యులు కొండేరీ రాజేశ్వర్, సౌకత్ అలీ,పందిరి భీమన్న,కొమ్ము రవి అజయ్,రూపా, రేఖా స్వచ్ఛంద సభ్యులు మహేందర్,బాల కృష్ణా,ప్రవీణ్, మెరాజ్, అబుజార్, లు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

తాండూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన బోగారం లక్షి మ్మ కి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులకు గురువారం సర్పంచ్ మారిశెట్టి స్రవంతి భూమి పూజ చేసి ప్రారంభించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఎంపీపీ అనిల్ కుమార్, పంచాయతి సెక్రటరీ కల్పన, జిపిఓ స్వామి, మాజీ జెడ్పిటిసి బండి పోషం, వార్డు సభ్యులు దాగం పాపయ్య అక్కపల్లి రజిత, దాగం పోచయ్య, వరిమడ్ల తిరుపతి, అంకన్న, గువ్వల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొడుతున్న సర్పంచ్ స్రవంతి

చెక్కులను అందజేస్తున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఆడే గజేందర్

నేరడిగొండ, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

పేద ప్రజలకు అత్యవసర సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల 5 వేల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం పెద్ద ఊరటనిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ముఖ్య లక్ష్యమని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన సహాయం కోసం ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చించోలిలో హనుమాన్ జయంతి వేడుకలు: పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, హనుమంతుని ఆశీస్సులు అందరికీ లభించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామసభలో అధికారులపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహం

నేరడిగొండ, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరడిగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీతంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. అధికారుల నిరక్ష్యం వల్ల స్థానిక నాయకులకు చెడ్డపేరు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు తప్పులు చేసి బదిలీపై వెళ్ళిపోతారని, కానీ ఆ మచ్చ గ్రామాల్లో శాశ్వతంగా ఉండే నాయకులపై పడుతుందని మండిపడ్డారు. గ్రామంలోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామ సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గులాబ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కలిగివుండాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై మహిళలకు అవగాహన కలిగివుండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ సఖి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మహిళలకు అందిస్తున్న సేవలు, సదుపాయాలు, నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు అత్యవసర పరిస్థితులలో సురక్షిత వాతావరణం కల్పించి వారి సమస్యల తక్షణ పరిష్కారం కోసం సఖి కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, ఆశ్రయం కల్పన వంటి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. సఖి కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించి నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుత స్థితి తెలుసుకున్నారు. ప్రతి కేసులో సమయానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, సచ కేంద్రంలో శుభ్రత, భద్రత, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

సఖి కేంద్రంలో తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

మహిళలపై జరుగుతున్న దాడులను, వేధింపులను అరికట్టడంలో సఖి కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని, మహిళల సంక్షేమం దిశగా సఖి కేంద్రం ద్వారా విశిష్ట సేవలు అందించడం జరుగుతుందన్నారు. సమాజంలో మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సచ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతూ మహిళలకు అందిస్తున్న సేవలు వివరాలు తెలుసుకుని ప్రతి కేసును సున్నితంగా పరిష్కరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని, మహిళల గోప్యతను కాపాడుతూ సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సఖి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే మా లక్ష్యం

- సర్పంచ్ జనాబాయి గణపత్

జైనూర్, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

అన్ని రంగాల్లో మానికొలం గూడ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని సర్పంచ్ జనాబాయి గణపత్ నాయక్ తెలిపారు. గురువారం జైనూర్ మండలంలోని మాని గూడ గ్రామపంచాయతీ పరిధిలో గల మానికొలం గూడలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయాన్ని ఆమె ప్రారంభించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఆధ్యాత్మికతతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు సర్పంచ్ జనాబాయి గణపత్ నాయక్ జాదవ్ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆత్రం భీమ్ రావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతువేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సదస్సు

నర్సాపూర్ (జి), ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు, ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బాలు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీ బాలు నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు తీరును, గత రెండు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని వివరించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్ మాట్లాడుతూ పలు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సదరం సర్టిఫికెట్ల జారీలో జరుగుతున్న ఆలస్యం వల్ల వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని, నూతన రేషన్ కార్డులు పొందిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్థానిక ఉన్నత పాఠశాల భవన నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన, ఎక్స్‌రే ఫిల్మ్‌ల లభ్యత వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ రెడ్డి, మండల విద్యాధికారి సాయన్న, ఉపసర్పంచ్ ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అంతా కలిసికట్టుగా కృషి చేద్దాం: నోడల్ అధికారి శ్యామ్

నేరడిగొండ, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో గురువారం నోడల్ అధికారి కొట్టూరి శ్యామ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు గ్రామ సర్పంచ్ సింగారి వసుంధర నవీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని తీర్మానించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు అందని వారి నుండి కొత్త దరఖాస్తులను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు రాని వారు, గ్యాస్ సబ్సిడీ సమస్యలు ఉన్నవారు, ఉచిత విద్యుత్‌కు అర్హులైన వారు తమ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా అడుగులు వేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తెడ్డు రవి, జీపీవో వినోద్, హెల్త్ సూపర్ వైజర్ వైష్ణవి, హెడ్ మాస్టర్ శ్రీనివాస్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, కారోబార్ కమలాకర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాళ్ల గురిజాల గ్రామసభలో ప్రభుత్వ పథకాలపై అవగాహన

- సమస్యల పరిష్కారానికి హామీ

బెల్లంపల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంచాయతీరాజ్ అండ్ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా బెల్లంపల్లి మండలం తాళ్ల గురజాల గ్రామంలో గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగ రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను కొనియాడారు. గ్రామ ప్రజలు పథకాల అమలులో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ గ్రామసభలో ఎంపీడీఓ బెల్లంపల్లి మహేందర్, స్పెషల్ ఆఫీసర్ పావని, గ్రామ కార్యదర్శి లక్ష్మీ, తాళ్ల గురుజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఈవెంజలిన్, ఉపసర్పంచ్ డాకూరి సురేష్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఏఎన్ఎం సిబ్బంది, వివో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్ అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయంలోని ఛాంబర్‌లో అధికారికంగా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రజా గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయడం, పాఠకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా చదువుపై ఆసక్తి పెంచేలా గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు, యువతకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అవసరమైన పుస్తకాలు, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ దండ విఠల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా, డిసిసి అధ్యక్షురాలు సుగుణ, మాజీ డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు పాల్గొని చైర్మన్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. అంతకుముందు వేద పండితులు మహేష్ శర్మ, శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, నాయకులు కలిసి చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కార్తీక్, భాగ్యలక్ష్మి, నాయకులు గాదవేణి మల్లేష్, తారీక్, జావిద్, శైలేందర్, గ్రంథాలయ సంస్థ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న అనిల్ కామ్దే

ఘనంగా కెరమెరిలో హనుమాన్ జయంతి

కెరమెరి, ఏప్రిల్ 02,ప్రభాత వార్త :

హనుమాన్ జయంతి వేడుకలను కెరమెరిలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం శోభా యాత్రను ప్రారంభించారు శివాలయంలో గుడి పూజారి బాపూజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు పూజలు చేసి వరకు శోభా యాత్ర లో పాల్గొన్నరు.హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో శ్రీరామ్,భక్తులు, మాల ధారణ చేసిన ఆంజనేయ స్వాములు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

హనుమాన్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు శిరీష శర్మ, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆలయ ఆవరణ భక్తులతో కిటకిట లాడాయి. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఆలయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలుహనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ కె. హరిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా స్వామి వారికి నిర్వహించిన అభిషేకాలు, అర్చనలలో కలెక్టర్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారం సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరిత

హర్ ఘర్ జల్‌గా మహమ్మదాబాద్ గ్రామ పంచాయతీ

జన్నారం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

జల్ జీవన్ మిషన్ కేంద్ర పథకంలో భాగంగా జన్నారం మండలం మహమ్మదాబాద్ గ్రామాన్ని హర్ ఘర్ జల్ గా ప్రకటించినట్లు మిషన్ భగీరథ ఎఇఇ నందనవర్మ తెలిపారు. గురువారం నాడు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు అందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సురక్షితమైన త్రాగునీరు ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడంలో ఇది ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. గ్రామ ప్రజలు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని, పైప్‌లైన్‌లను దెబ్బతీయకుండా సంరక్షించుకోవాలని సూచించారు. అలాగే నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి గ్రామ ప్రజల సహకారం అత్యంత అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాబాద్ గ్రామ సర్పంచ్ ఆర్, శంకరయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి టి. మహేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లె నా ప్రగతి ప్రణాళిక గ్రామసభలు

బెజ్జూర్,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:

బెజ్జూర్ మండల కేంద్రంలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభను సర్పంచ్ దుర్గం సరోజ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఇట్టి గ్రామ సభకు తహసిల్దార్ రామ్మోహన్ వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల ద్వారా ఇదివరకు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.అనంతరం తహసిల్దార్ ముఖ్యమంత్రి పంపించిన సందేశాన్ని సభ సభ్యులకు చదివి వినిపించారు.99 రోజుల కార్యచరణ ప్రణాళిక పై అవగాహన కల్పించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న ఆరు గ్యారెంటీ లపై అవగాహన కల్పించారు.వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని సమస్యలను తెలియజేసినట్లయితే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు.మండలంలోని అన్ని గ్రామపంచాయతీలోనూ గురువారం ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి వివిధ శాఖల అభివృద్ధి పనులను వివరించారు.

శోభాయాత్రకు వెళుతున్న హనుమాన్ భక్తులు

ఘనంగా హనుమాన్ జయంతి సంబరాలు

బెజ్జూర్,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:

బెజ్జూర్ మండల కేంద్రంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడిపల్లి మహేష్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.బుధవారం సాయంత్రమే బస్టాండ్ ఏరియాలో కాషాయ రంగు తోరణాలతో అలంకరించారు.ముందుగా హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.అనంతరం గ్రామస్తులు,మహిళలు,యువతీ యువకులు హనుమాన్ ఆలయం వద్ద నుండి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.ఈ శోభాయాత్రలో యువతి యువకులు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు.శోభయాత్ర ఆసాంతం ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం రాచకొండ స్వప్నిల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద ఎత్తున గ్రామస్తులు,యువతీ యువకులు,మహిళలు పాల్గొన్నారు.

బాల్యవివాహ నిషేధ చట్టం పోస్టర్ విడుదల చేసిన అధికారులు

ఘనంగా 99వ రోజు ప్రజా పాలన కార్యక్రమం

చింతలమానెపల్లి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని డబ్బా గ్రామ పంచాయతీలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99వ రోజు గ్రామ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ 99 రోజుల కాలంలో సాధించిన ప్రగతిని సమీక్షిస్తూ, మిగిలి ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా హౌసింగ్ విభాగం డీఈఈ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణ పథకాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి మరియు అన్ని డిపార్ట్‌మెంట్‌ల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. గ్రామ సభలో స్థానిక సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, సంతోష్, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణ, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని రాజంపేట గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ బుర్స పోచయ్య అధ్యక్షతన నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ పారిశుద్ధం, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డ్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి చర్యలు

మందమర్రి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో గురువారం వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు సారథ్యంలో జరిగింది. ఈ క్రమంలో షిర్కె ఏరియాలోని 4వ, 7వ వార్డుల్లో డబుల్ బెడ్‌రూమ్ ఏరియా ప్రాంగణంలో, 8వ వార్డులో 3వ జోన్ ప్రాంతంలో, 14వ వార్డులో ప్రత్యేకంగా వార్డు సభలను నిర్వహించారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ముందుగా జయ జయే తెలంగాణ రాష్ట్ర గేయాన్ని ఆలపించి, అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), సన్నరకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాల గురించి వివరించారు. అలాగే పథకాల లబ్ధిదారుల వివరాలను తెలియజేసి, ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారికి వినతిపత్రాలు, దరఖాస్తులు స్వీకరించారు. వార్డు అభివృద్ధికి సంబంధించిన తీర్మానాలను చదివి వినిపించి, సమస్యలు మరియు వాటి పరిష్కారాలపై చర్చించి రిజిస్టర్‌లో నమోదు చేశారు. త్వరలో ప్రవేశపెట్టబోయే కొత్త పథకాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, ఇంచార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ వి. వసంత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యం. గోపీకృష్ణ, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఏ. రఘురాం, ప్రత్యేక అధికారులు, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బి. సి. సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్క సైనికులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని, రాజ్యాధికార సాధనపై ప్రజలలో చైతన్యం కలిగించారని, బానిస ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. మహనీయుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, బి సి సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్, బిసి సంఘాల ప్రతినిధి కె.లచ్చన్న, గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గనులపై చేపడుతున్నటువంటి పర్యావరణ పరిరక్షణకై కేంద్ర బృందం పరిశీలన

- రామకృష్ణాపూర్‌లో కేంద్ర పర్యావరణ శాఖ బృందం పర్యటన

క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్‌లో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (మోఫ్) ఉన్నతాధికారుల బృందం గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించింది. కేంద్ర పర్యావరణ శాఖ సలహాదారు తరుణ్, పర్యావరణ అధికారుల బృందం, సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ జనరల్ మేనేజర్ సైదులు, మందమర్రి ఏరియా జి.ఎం రాధాకృష్ణలతో కలిసి వివిధ ప్రాంతాలను సందర్శించారు. రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ గని పరిసర ప్రాంతాలను అధికారులు సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న కాలుష్య నివారణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. హరితహారం ప్లాంటేషన్, గనుల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లను తనిఖీ చేశారు. నీటి శుద్ధి ప్రక్రియ పునర్వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్.డి.టి.సి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, మందమర్రి ఏరియాలో పర్యావరణ సమతుల్యత కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ నిబంధనల అమలులో యాజమాన్యం ప్రదర్శిస్తున్న చొరవను కేంద్ర అధికారులు అభినందించారు. ఈ పర్యటనలో ఎస్.ఓ. టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, రామకృష్ణాపూర్ ఉపరితల గని మేనేజర్ పంకజ్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకటరెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ట్రావెలింగ్ రోడ్ల వెంబడి చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్, గనుల పరిసరాల్లో పెరిగిన పచ్చదనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియాలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు,

గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీవో గోవర్ధన్

దిలావర్పూర్‌లో గ్రామసభ

- సమస్యలు లేవనెత్తిన గ్రామస్తులు

- అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు సూచన

దిలావర్పూర్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే అధికారులు అని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. గురువారం దిలావర్పూర్ మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ఉపసర్పంచ్ సుఖేష్ తెలిపారు. ముందుగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ ఎంతమంది లబ్ధి పొందుతున్నారో తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామస్తులకు ఒకటిగా లేవనెత్తారు. రైతు బీమా ఏలా దరఖాస్తు చేసుకోవాలో తెలుపాలని సూచించారు. విద్యుత్ పరమైన సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని అధికారులకు గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుండి ఎల్లమ్మ ఆలయం వరకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన మందులు లేవని సిబ్బంది కొరత ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డెంగ్యూ వంటి ప్రాణాంతకమైన వ్యాధులతో కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పందుల సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు కోరారు. అంగన్వాడి, ఐకెపి, విద్య వంటి అధికారులు తమ చేపట్టిన అంశాలను గ్రామస్తులకు తెలిపారు. ఈ సభలో పట్టించుకున్న అంశాలను త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఇందులో అన్ని శాఖల ప్రభుత్వాధికారులు నాయకులు అనిల్, వార్డ్ మెంబర్లు యువకులు గ్రామస్తులు ఉన్నారు.

పారాక్వాట్ గడ్డి మందును రెండు నెలల పాటు నిషేధించిన రాష్ట్ర ప్రభుత్వం

జన్నారం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

రైతులు ఉపయోగించే పారాక్వాట్ 24 శాతం ఎస్ ఎల్ గడ్డి మందును రెండు నెలల పాటు నిషేధం విధించారని ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి అనుగుణంగా మండలం లోని స్టాక్ అవైలబుల్ ఉన్న 12 పురుగు మందుల దుకాణాల్లో 402 లీటర్ల గడ్డి మందు స్టాప్ సేల్ చేయడం జరిగిందని అన్నారు. క్రయ విక్రయాలు నిలిపివేసిన ఇట్టి గడ్డి మందును రైతులు కూడా గమనించి వాడకూడదని తెలియచేశారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రజా పాలన లక్ష్యం

- మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాపాలన లక్ష్యమని మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. గురువారం రోజు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో నిర్వహించిన వార్డు సభ కార్యక్రమంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ... ఈ ప్రజాపాలన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గెలిచి రెండున్నర సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని చెప్పారు. వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సురేఖని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వివిధ శాఖల అధికారులు, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నర్సయ్య, వైస్ చైర్మన్ మోత్కూరు రాజేశ్వరి వెంకట స్వామి గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి వార్డు సభలు దిశానిర్దేశం

బెల్లంపల్లి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7, 16, 29వ వార్డుల్లో గురువారం వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల అమలు విధానం, అవి అర్హులైన లబ్ధిదారులకు ఎలా చేరుతున్నాయో వివరించారు. అలాగే ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు తెలియజేశారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ విభాగాలు పాల్గొని పథకాల అమలు, సమస్యల పరిష్కారం, లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, బెల్లంపల్లి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఈ వార్డు సభలను నిర్వహిస్తున్నాం. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కారం పొందాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.